క్లుప్తంగా

టీడీపీ కార్యకర్తలపై కేసులు నమోదు

పిఠాపురం: గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేటకి చెందిన టీడీపీ కార్యకర్తలపై శనివారం కేసులు నమోదు చేసినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం శనివారం జనసేన ఎమ్మెల్సీ నాగబాబు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేటలో పర్యటించేందుకు వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక జనసేన నేత మొయిళ్ల నాగబాబు కాన్వాయ్ వెంట మోటార్ సైకిల్‌పై వెళుతుండగా అదే గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్తలు సీరం అప్పారావు, మరో వ్యక్తి అడ్డగించి జై వర్మ అంటూ నినాదాలు చేస్తూ అతనిపై దాడి చేసారు. దీనిపై మొయిళ్ల నాగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఎస్సై విధులకు ఆటంకం కలిగించినందుకు..
ఇదే వివాదంలో గొడవ పడుతున్న సీరం అప్పారావు మరికొంత మందిని విధి నిర్వహణలో భాగంగా అదుపు చేయడానికి ప్రయత్నించిన క్రమంలో తనను తోసివేసి, విధులకు ఆటంకం కలిగించారని పిఠాపురం అదనపు ఎస్సై జాన్ బాషా ఇచ్చిన ఫిర్యాదుపై సీరం అప్పారావు మరి కొందరిపై మరో కేసు నమోదు చేసినట్లు గొల్లప్రోలు పోలీసులు తెలిపారు.

పిఠాపురంలో రేపు గ్రీవెన్స్

పిఠాపురం: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ పీజీఆర్ఎస్ కార్యక్రమం ఈ నెల 7న సోమవారం నిర్వహిస్తున్నట్లు పాడా పీడీ చైత్ర వర్షిణి తెలిపారు. పిఠాపురం మున్సిపల్ గెస్ట్ హౌస్ వద్ద పాడా కార్యాలయంలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. పిఠాపురం నియోజక వర్గానికి సంబంధించిన డివిజనల్, మండలస్థాయి అధికారులందరూ హాజరు కావాలని పీడీ ఆదేశించారు. సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామని ఆమె తెలిపారు.

9, 10 తేదీల్లో ప్రత్యేక ప్రార్థనలు

పెద్దాపురం: ప్రపంచ శాంతి కోరుతూ ఈ నెల 9, 10 తేదీల్లో మండలంలోని తిరుపతి క్రీస్తు శాంతి ప్రార్థనా మందిరంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు సీజీఎం వ్యవస్థాపకుడు నంగిన శామ్యూల్ సుదీప్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 9వ తేదీన స్త్రీల సదస్సు ప్రత్యేక ప్రార్థన నిర్వహిస్తామన్నారు. కాకినాడకు చెందిన డి.షారోన్ విలియమ్స్ వాక్య సందేశాన్ని అందిస్తారన్నారు. 10వ తేదీన పురుషుల సదస్సు ప్రత్యేక ప్రార్థన నిర్వహిస్తామన్నారు. ఆ రోజున పెదపూడి మండలం పైనకి చెందిన రెవరెండ్ జె.చంద్రపాల్ వాక్య సందేశాన్ని అందిస్తారన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం

పిఠాపురం: పిఠాపురం విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల్లో భాగంగా ఈనెల 7న విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ప్రభాకర్ తెలిపారు. ఈనెల 7న సోమవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11 కేవీ పిఠాపురం సబ్‌స్టేషన్ నుంచి వచ్చే 11కేవీ ఫీడర్‌పై గల పిఠాపురం టౌన్, కోలంక, జములపల్లి, మాధవపురం, ఇల్లింద్రాడ, నరసింగపురం పరిసర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ తెలిపారు.

మట్టి మాఫియా బరితెగింపు

- గతంలో రామేశం మెట్ట, ఇప్పుడు తాత చెరువు
- మెట్ట ప్రాంత చెరువుల్లో యథేచ్ఛగా కొనసాగుతున్న దందా
- కూటమి నేతల కనుసైగతో అటువైపు చూడని అధికార యంత్రాంగం


గ్రావెల్ లారీలతో మట్టిమయంగా మారిన రహదారి


గ్రీవెన్స్‌లో మట్టి మాఫియాపై ఫిర్యాదు చేస్తున్న లక్ష్మణరావు

పెద్దాపురం: పచ్చని పంట పొలం, మెట్ట భూమి అనే తేడా లేకుండా ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ వాలిపోయి మట్టి మాఫియా పేట్రేగిపోతోంది. ఖాళీ ప్రదేశాలు, ప్రభుత్వ భూములు కంట పడితే చాలు అక్రమార్కులు బరితెగించి మట్టిని దోచుకుంటున్నారు. మట్టిని తవ్వి లక్షల్లో సంపాదనే ధ్యేయంగా ప్రస్తుత కూటమి నేతల దందా అడ్డూఅదుపు లేకుండా సాగుతోంది. కోట్ల రూపాయలు విలువ చేసే రామేశంమెట్టపై ఇప్పటికీ రాత్రి, పగలు నిత్యం గ్రావెల్ దందా కొనసాగిస్తూనే ఉన్నారు.

ప్రశ్నిస్తే వార్నింగ్‌లు
కట్టమూరు రహదారిలోని పెద్దాపురం పట్టణ పరిధిలో తాత చెరువుపై కూటమి నేతలు కన్నేసారు. సర్వే నంబర్ 62/19లో సుమారు 6.51 ఎకరాల తాత చెరువులో మట్టి అక్రమ తవ్వకాలకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్నా అధికార యంత్రాంగం అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి. కూటమి నేతల కనుసైగతో గ్రావెల్, మట్టి వ్యాపారం జోరుగా సాగుతోంది. ప్రభుత్వ మెట్ట భూములను హరించడంపై పర్యావరణ ప్రేమికులు ప్రశ్నిస్తే వారికి వార్నింగ్‌లు, అధికారులపై హుంకుం జారీ చెయ్యడంతో ఇక వాళ్ల అక్రమ దందా అడ్డుకట్ట వేసే వారు లేరు.

చోద్యం చూస్తున్న రెవెన్యూ, మైనింగ్ అధికారులు
అక్రమ మట్టి, గ్రావెల్ తవ్వకాలు ముమ్మరంగా సాగుతున్నా అదుపు చేయాల్సిన రెవెన్యూ, మైనింగ్ శాఖాధికారులు చోద్యం చూస్తున్నారు. మామూళ్ల మత్తు, అధికార పార్టీ నేతల ఆదేశాల ముందు తమ విధులు, హక్కులను ప్రదర్శించ లేక మౌననిద్రలో అధికార యంత్రాంగం ఉంది. ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆ ఒక్క రోజూ గ్రావెల్ లారీలు, జేసీబీలను అడ్డుకుంటున్నారు. మరుసటి రోజున యథాతథంగా తవ్వకాలు కొనసాగుతున్నాయి. ఇదేమిటని ప్రశ్నిస్తే ఫిర్యాదు అందితే చర్యలు చేపడతామంటూ విచిత్ర సమాధానం చెబుతూ అధికార యంత్రాంగం కాలం వెళ్లదీస్తోంది.

అక్రమ మట్టి తవ్వకాలు ఆపాలి



పెద్దాపురం మండలంలో అక్రమ మట్టి తవ్వకాలను ఆపాలి. దీనిపై పలుమార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాను. అధికారులు తాత్కాలిక చర్యలు తీసుకుని అనంతరం పట్టించుకోలేదు. అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకున్న దాఖల్లాలేవు. మట్టి అక్రమ రవాణా అంశంపై కోర్టులో ప్రైవేట్ కేసు వేస్తాం.
– గుణ్ణం లక్ష్మణరావు, ఫర్ ది పీపుల్ ఫౌండేషన్ చైర్మన్, పెద్దాపురం

ఎటువంటి అనుమతులూ లేవు



మట్టి తవ్వకాలకు పెద్దాపురంలో ఎటువంటి అనుమతులూ లేవు. అనధికార మట్టి తవ్వకాలు జరిపితే చర్యలు తప్పవు. మైనింగ్ శాఖ అనుమతులున్నాయో లేదో తెలుసుకుంటాం. మా దృష్టికి వస్తే గతంలో తవ్వకాలు నిలిపివేశాం. ఎక్కడైనా గ్రావెల్, మట్టి అనధికార తవ్వకాలు జరిపితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తప్పవు.
–కె.వెంకటలక్ష్మి, తహసీల్దార్, పెద్దాపురం

పంచారామ క్షేత్రంలో వసంత నవరాత్ర పూజలు


ప్రత్యేకాలంకరణలో కుమారారామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రమైన బాలాత్రిపుర సుందరి సమేత కుమారారామ భీమేశ్వర స్వామి ఆలయంలో ఉగాది సందర్భంగా ప్రారంభమైన వసంత నవరాత్రి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. శనివారం ఆలయ అభిషేక పండితులు వేమూరి సోమేశ్వరశర్మ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈఓ బళ్ల నీలకంఠం పర్యవేక్షణలో స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి బంగారు కిరీటం అలంకరించారు.

రెల్లి అనుబంధ కులాలకు రిజర్వేషన్ శాతం పెంచాలి


పిఠాపురంలో ప్రదర్శన నిర్వహిస్తున్న రెల్లి కుల సంఘం నాయకులు

- రెల్లి అనుబంధ కులాల సంఘం నాయకుల ఆవేదన
- పిఠాపురంలో కదం తొక్కిన రెల్లి కుల సంఘం నేతలు

పిఠాపురం: ఎస్సీ వర్గీకరణలో ససూచించిన రిజర్వేషన్ శాతంలో రెల్లి అనుబంధ కులాలకు అన్యాయం జరుగుతోందని సంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పిఠాపురంలో శనివారం వారు భారీ పాదయాత్ర నిర్వహించారు. పిఠాపురం రెల్లికుల సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో స్థానిక పశువుల సంత నుంచి ర్యాలీ నిర్వహించారు. రెల్లి అనుబంధ కులాలకు జరుగుతున్న అన్యాయంపై ప్రభుత్వం స్పందించాలని నినాదాలు చేశారు. ర్యాలీ మున్సిపల్ కార్యాలయం కోటగుమ్మం ఉప్పాడ బస్టాండ్ మీదుగా తాహసీల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం రిజర్వేషన్ వర్గీకరణలో అత్యధికంగా ఉన్న రెల్లి ఉపకులాలకు ఒక శాతం రిజర్వేషన్ కల్పించడం న్యాయం కాదన్నారు. ఇది అత్యధిక సంఖ్యలో ఉన్న రెల్లి కులస్తులకు ఏమాత్రం సరిపోదని చెప్పారు. 2011 కంటే రెల్లి కులస్తుల సంఖ్య గణనీయంగా పెరిగిందన్నారు. గతంలో 12 ఉప కులాలకు అదనంగా, బేడా బుడ్గా జంగం కులాన్ని చేర్చారని వారన్నారు. తాజా జనాభా సంఖ్య ప్రాతిపదికన రెల్లి ఉపకులాలకు రెండు శాతం రిజర్వేషన్ కేటాయించాలని, బేడా బుడ్గా జంగాలను వేరే గ్రూప్‌లో చేర్చాలని వారు డిమాండ్ చేశారు. జస్టిస్ రామచంద్ర కమిషన్ రిపోర్ట్‌ను అనుసరించి రెల్లి కులస్తులు దళితుల్లోనే అత్యంత దయనీయ స్థితిలో ఉన్నారని గుర్తించి వారిని ప్రత్యేక గ్రూప్‌గా రిజర్వేషన్ కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ, జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుకు వినతిపత్రాలు అందజేశారు. ఈ పాదయాత్రలో పిఠాపురం న్యాయవాది బంగారు రామకృష్ణ, ఆకుల సూరిబాబు, అల్లం కిషోర్, ఎర్రంశెట్టి శ్రీనివాస్ ఇంటి రాంబాబు, ధనాల నాని, అల్లం పాపారావు ఆధ్వర్యం వహించారు. రాష్ట్ర నాయకులు రెల్లి కార్పొరేషన్ మాజీ చైర్మన్ వడ్డాది మధుసూదన్‌రావు, రాష్ట్ర ప్రెసిడెంట్ నీలాపు వెంకటేశ్వరరావు, నిమ్మకాయల రమణ మూర్తి, మీసాల ఏడుకొండలు, మహిళా నాయకులు బంగారు ద్వారక, నాగమణి, దుర్గాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు

అకాల వర్షం... అన్నదాతకు నష్టం

- ఈదురుగాలులతో భారీ వర్షం
- కళ్లాల్లో తడిసి ముద్దయిన ధాన్యం
- గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పిఠాపురం: ప్రచండ భానుడి ప్రతాపంతో మండిన ఎండ ఒక్కసారిగా మటుమాయమై అనుకోని అతిథిగా వచ్చిన అకాల వర్షం అన్నదాతను నిండా ముంచేసింది. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక ధాన్యం విక్రయించే అవకాశం లేక పంట కోత పూర్తి చేసుకున్న అన్నదాతలు తమ పొలాల్లో ధాన్యాన్ని ఆరబెట్టుకున్నారు. ఎక్కడా వర్షం వచ్చే సూచనలు లేకపోవడంతో జాగ్రత్తలు తీసుకోలేదు. ఒక పక్క ఎండ మండుతూనే నిమిషాల వ్యవధిలో శనివారం మధ్యాహ్నం ఒక్కసారిగా వాతావరణం మారి ఆకాశం మేఘావృతమై ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. దీంతో ధాన్యాన్ని జాగ్రత్త చేసుకునే వీలు లేక రైతులు కళ్లాల్లోనే వదిలేశారు. దీంతో ధాన్యం తడిసి ముద్దయ్యింది. ఇప్పటికే సార్వా సీజన్‌లో ఏలేరు వరదల వల్ల తీవ్ర నష్టాలను చవి చూసిన కర్షకుడు రబీ సాగుతో కొంత తేరుకుందామనుకుంటే అకాల వర్షం రైతుల ఆశలపై నీళ్లు చల్లింది. పిఠాపురం నియోజకవర్గంలో శనివారం కురిసిన అకాల వర్షానికి సుమారు 1,100 ఎకరాల్లో ధాన్యం రాశులు తడిసిముద్దయినట్లు రైతులు చెబుతున్నారు. యంత్రాలతో కోతలు పూర్తి చేయడం వల్ల తేమ శాతం తగ్గించడానికి ఎండలో ఆరబెట్టామని కాని అనుకోకుండా వచ్చిన వర్షం వల్ల ధాన్యం తడిసిపోవడంతో తీవ్ర నష్టాలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు 180 ఎకరాల్లో వరి పనలు సైతం తడిసిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేసవి తాపం నుంచి ఊరట


గొల్లప్రోలు మండలంలో వర్షానికి తడిసిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

సామర్లకోట: ఎండలు మండిపోతున్న తరుణంలో శనివారం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది దీంతో ప్రజలు వేసవి తాపం నుంచి ఊరట చెందారు. సాయంత్రం ఒక్కసారిగా వాతావరణం మారి ఈదురు గాలులు రావడంతో ఊహించని పరిణామానికి రోడ్లపై ఉన్న ప్రజలు పరుగులు తీసారు. భారీ వర్షం కారణంగా పల్లపు ప్రాంతాలతో పాటు స్టేషన్ సెంటర్, బస్సు కాంప్లెక్స్, సత్యనారాయణపురం, సంపెంగతోట, సీతారామ కాలనీల్లోకి నీరు చేరడంతో ఆయా ప్రాంతాలు చెరువును తలపించాయి. స్థానిక పెద్దాపురం రోడ్డు నుంచి రథం సెంటర్‌కు వెళ్లే రోడ్డులో డ్రెయిన్‌లో పూడిక పేరుకుపోవడంతో మురుగు నీరు రోడ్డుపై పొంగి ప్రవహించి ఆ ప్రాంతమంతా దుర్వాసన వ్యాపించింది. ఈ రోడ్డులో రాక పోకలు సాగించిన కొంతమంది ద్విచక్ర వాహనచోదకులు, పాదచారులు బురద కారణంగా జారి పడ్డారు. ఈదురు గాలుల కారణంగా చెట్ల కొమ్మలు విరిగిపడి విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. దీంతో పట్టణంలో సాయంత్రం 4.30 నుంచి 7.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఏఈ రమేష్‌కుమార్ సిబ్బంది కలసి మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.


సామర్లకోటలో విద్యుత్ తీగలపై పడిన కొబ్బరి చెట్టు


సామర్లకోట స్టేషన్ సెంటర్‌లో రోడ్డుపై వర్షపు నీరు


గొల్లప్రోలులో బరకాలతో ధాన్యానికి రక్షణ


సామర్లకోట రథం సెంటర్‌లో రోడ్డుపై పొంగి ప్రవహిస్తున్న డ్రెయిన్‌లోని మురుగునీరు

జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు కృషి


సామర్లకోటలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పించిన వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు తదితరులు

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు
- ఘనంగా జగ్జీవన్‌రామ్ జయంత్యుత్సవం

సామర్లకోట: దివంగత నేత, మాజీ ఉప ప్రధాని, స్వాతంత్ర్య సమరయోధుడు బాబు జగ్జీవన్‌రామ్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుమ్మరవీధిలో జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని కొనియాడారు. అనంతరం ఆయన కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ ఊబా జాన్ మోజెస్, అయ్యరక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు ఆవాల లక్ష్మీ నారాయణ, కౌన్సిలర్లు నేతల హరిబాబు, పాగా సురేష్‌కుమార్, పాలిక కుసుమచంటి, మర్రి శేషారావు, సుబ్బల సత్యనారాయణ, సేపెని సురేష్, పిట్టా సత్యనారాయణ, జట్ల మోహన్, రాగంపేట సర్పంచ్, పార్టీ నాయకులు రెడ్నం దొరబాబు, వేగి సత్యనారాయణ, చిట్టుమాని శ్రీనివాసు, రెడ్డి శ్రీనివాసు, కానేటి బుల్లి అప్పారావు, మాదిగ దండోరా నాయకులు పాల్గొన్నారు.

జగ్జీవన్‌రామ్‌కు ఎమ్మెల్యే నివాళులు
పట్టణ పరిధిలో బల్లమార్కెట్, కుమ్మరవీధి,కొత్తపేటలోని బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కూటమి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ యార్లగడ్డ చిన్ని, మాదిగ దండోరా నాయకుడు కాపవరపు కుమార్ తదితరులు పాల్గొన్నారు. జనసేన నాయకుడు కొడా చైర్మన్ తుమ్మల బాబు పట్టణంలోని జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జగ్జీవన్‌రామ్, అంబేద్కర్ విగ్రహాల ఆవిష్కరణ
పిఠాపురం: జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం పిఠాపురం నియోజకవర్గంలో ఘనంగా నిర్వహించారు. గొల్లప్రోలు అరుంధతీయ పేట కమ్యూనిటీహాల్ వద్ద జగ్జీవన్‌రామ్ విగ్రహం నుంచి ర్యాలీ నిర్వహించారు. నూతనంగా ఏర్పాటు చేసిన జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ విగ్రహాలను జాతీయ మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ముఖ్య సలహాదారుడు డాక్టర్ దూలపల్లి సుబ్బారావు ఆవిష్కరించారు. గొల్లప్రోలు మండలం చెందుర్తిలో జగ్జీవన్ యువజన సంఘం ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

పిఠాపురంలో..
పిఠాపురంలో రిక్షా కార్మికుల ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. పిఠాపురంలో బీజేపీ ఆధ్వర్యంలో జగ్జీవన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు దాట్ల వెంకటసూర్యనారాయణ రాజు, గండి కొండలరావు, పట్టణ అధ్యక్షుడు ఓలేటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.
ఇందిరానగర్ ఏడవ వార్డులో జగ్జీవన్ రామ్ జయంతిని జగ్జీవన్ రామ్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా వార్డు కౌన్సిలర్ బోను దేవా పాల్గొన్నారు.

సాంఘిక సంక్షేమ వసతిగృహంలో..
పెద్దాపురం: జగ్జీవన్‌రామ్ జయంతిని పెద్దాపురం అర్బన్, రూరల్ ప్రాంతాల్లో శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సాంఘిక సంక్షేమ వసతి గృహం ఆనంద నిలయంలో శనివారం జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కుడా చైర్మన్ తుమ్మల బాబు, ఆర్డీఓ కె.శ్రీరమణి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ వసతిగృహంలో విద్యార్థులకు అందుతున్న సేవలపై అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అవసరమైన ఇన్వర్టర్, ఆర్వో ప్లాంట్, సీసీ కెమెరాలు త్వరితగతిన ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతానని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోషల్ వెల్ఫేర్ జేడీ ఎస్.శ్రీనివాసరావు, రెవెన్యూ, సాంఘిక సంక్షేమ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.
పెద్దాపురంలోని కొండయ్యపేటలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక వార్డు ప్రజలు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. దివిలి గ్రామంలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కాలనీలో ప్రజలకు స్వీట్లు పంపిణీ చేశారు.


జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ షణ్మోహన్, ఎమ్మెల్యే చినరాజప్ప


పిఠాపురంలో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు


పిఠాపురం ఇందిరా నగర్‌లో జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద నివాళులర్పించిన నాయకులు

సీతారాముల కల్యాణం చూతము రారండి


సామర్లకోటలో సీతారాముల కల్యాణోత్సవానికి రామాలయం ముస్తాబు


పిఠాపురంలో కల్యాణానికి ముస్తాబైన సీతారాములు

- పెళ్లి కుమారుడిగా శ్రీరాముడు, పెళ్లి కుమార్తెగా సీతాదేవి ముస్తాబు
- నేడు శ్రీరామనవమి

పిఠాపురం: శ్రీరాముడు, సీతామహాతల్లికి పెళ్లికళ వచ్చేసింది. శ్రీరామ నవమి ఉత్సవాల సందర్భంగా శనివారం పెళ్లి కుమారుడిగా శ్రీరాముడు, పెళ్లి కుమార్తెగా సీతాదేవి భక్తులకు దర్శనమిచ్చారు. వివిధ ఆలయాల్లో ప్రత్యేక పూజలతో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కల్యాణ వేడుకలలో భాగంగా శనివారం రాములవారిని, సీతాదేవికి కల్యాణ అలంకరణలు నిర్వహించారు. పసుపు రాటలు వేసి కల్యాణోత్సవాలు ప్రారంభించి స్వామివారికి అభిషేకాలు నిర్వహించారు. ఆలయాల వద్ద చలువ పందిళ్లు వేసి పచ్చని మామిడి తోరణాల అలంకరించారు. నియోజకవర్గంలో పిఠాపురం మున్సిపాలిటీ, గొల్లప్రోలు నగర పంచాయతీ, పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో ఉన్న సుమారు 320 రామాలయాల్లో శ్రీరామనవమి ఉత్సవాల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు పూర్తి చేసారు. 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. పిఠాపురం పట్టణం పల్లపు వీధి రామాలయం పప్పుల వీధి, చిట్వోడి దిబ్బ, సీతయ్య గారి తోట పరిసర ప్రాంతాల్లోని రామాలయాల్లో నవమి వేడుకలకు నిర్వాహకులు ఏర్పాట్లు ఘనంగా చేసారు. పట్టణంలోని పుల్లయ్య కాలువ వీధి కోదండ రామాలయంలో శ్రీరామనవమి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్టు ఆలయ నిర్వాహకులు నల్లా శ్రీను, అర్చకులు విజయ జనార్ధనాచార్యులు తెలిపారు. అన్ని ప్రాంతాల్లో మధ్యాహ్నం ఉదయం 8 గంటల నుంచి శ్రీరామ కల్యాణం నిర్వహించేందుకు ముహూర్తాలు నిర్ణయించారు. గొల్లప్రోలు మండల పరిధిలో గొల్లప్రోలులోని పురాతన, ప్రసిద్ధి చెందిన సీతారామస్వామి, మండలంలోని ప్రసిద్ధి చెందిన చేబ్రోలు సీతారామస్వామి ఆలయంలలో కల్యాణ మహోత్సవాల సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద భారీ సెట్టింగులతో విద్యుత్ దీపాలంకరణ చేశారు.

శ్రీరామనవమికి ఘనంగా ఏర్పాట్లు
సామర్లకోట: శ్రీరామ నవమి సందర్భంగా సీతారాముల కల్యాణం నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. పట్టణం, మండలం పరిధిలో ప్రతి వార్డు, గ్రామాల్లో రామాలయాలున్నాయి. ఆయా రామా లయాల వద్ద చలువ పందిర్లు, ఆలయాలకు రంగులు, విద్యుత్తు దీపాలంకరణ పూర్తి చేశారు. ఆయా ప్రాంతాలల్లోని భక్తులందరికీ సీతారాముల కల్యాణం కనిపించే విధంగా ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేశారు. స్థానిక మఠంసెంటర్‌లోని రామాలయం, నీలమ్మ చెరువు వద్ద ఉన్న రామాలయం వద్ద సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. స్థానిక సత్యనారాయణపురంలో రామాలయ యూత్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు.